

నేడు రైతు భరోసాపై సీఎం సందేశం

కరీంనగర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ రైతు వేదికలో మధ్యాహ్నం 3.30 గంటలకు దృశ్య, శ్రవణ మాధ్యమాల ప్రారంభోత్సవం ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ఫైడితల్లి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధుల విడుదలపై ముఖ్యమంత్రి సందేశం ఇవ్వనున్నారని చెప్పారు. మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్, చేగుర్తి, బొమ్మకల్ గ్రామాల రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్లాక్ ఫిల్మ్‌లపై కొరడా



టింట్ మీటర్‌తో వాహనాన్ని తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ, ఎస్‌ఐలు

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్‌లు
- వీఎల్‌టీ 75 శాతం వరకు అనుమతి
- టింట్ మీటర్ల ద్వారా తనిఖీలు

కరీంనగర్ క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి నాలుగు వైపులా ఏర్పాటు చేసిన అద్దాల ద్వారా లోపలి మనుషులు బయటకు కనపడే విధంగా ఉండాలి. షోరూం నుంచి విడుదల అయ్యే వాహనాలకు అద్దాలపై ఎలాంటి బ్లాక్‌ఫిల్మ్, షేడ్ ఫిల్మ్‌లు ఉండవు. వాహనదారులు కారు లోపలి దృశ్యాలు బయటకు కనపడకుండా బ్లాక్‌ఫిల్మ్‌ను మోతాదుకు మించి అతికించుకుంటున్నారు. బ్లాక్‌ఫిల్మ్‌లతో ఏదైనా నేరాలు జరిగినప్పుడు వాహనాల్లోని దృశ్యాలు కనిపించక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇష్టారాజ్యంగా బ్లాక్‌ఫిల్మ్‌లు

కారు అద్దాలపై అతికించే బ్లాక్‌ఫిల్మ్ కారు లోపలి దృశ్యాలు 75 శాతం వరకు బయటకు కనిపించాలి. 75 శాతానికి తగ్గితే అది చట్ట ఉల్లంఘన కిందకు వస్తుంది. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకమైన పరికరం టింట్ మీటర్‌తో బ్లాక్ ఫిల్మ్‌లను పరీక్షిస్తున్నారు. ఈ టింట్ మీటర్‌ను బ్లాక్‌ఫిల్మ్ అతికించిన కారు అద్దానికి రెండు వైపుల పెట్టగానే ఆ ఫిల్మ్ ఎంత శాతం ఉందనేది డిజిటల్‌మీటర్ ద్వారా స్క్రీన్ పై తెలుస్తుంది. ట్రాఫిక్ నిబంధనలకు మించి ఉంటే వాహనదారుడిపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తున్నారు. వీఎల్‌టీ (విజిబుల్ లైట్ ట్రాన్స్‌మిషన్) ప్రమాణాలకు అనుగుణంగా లేకుంటే అది చట్టవిరుద్ధంగా పరిగణిస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి విడుదల అయ్యే వాహనాలకు ఫాక్టరీ ఫిటెడ్ సన్‌షేడ్ లేదా గ్లాస్ టింట్‌ను స్టాండర్డ్ ఫీచర్‌గా ఆయా కంపెనీలు అందిస్తున్నాయి. షోరూంల నుంచి విడుదల అయిన కార్ల బ్లాక్ ఫిల్మ్‌లు కొన్ని వీఎల్‌టీ ప్రమాణాలకు అనుగుణంగా లేవనే విషయం టింట్‌మీటర్‌తో పరీక్షల అనంతరం తెలుస్తోంది. కంపెనీ ఏర్పాటు చేసిన బ్లాక్‌ఫిల్మ్‌లు కూడా ప్రమాణాలకు అనుగుణంగా లేవనడం ఎంత వరకు సబబు అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.



కారు అద్దం విజిబుల్ లైట్ ట్రాన్స్‌మిషన్ తెలిపే టింట్ మీటర్

నెలరోజుల్లో 43 వాహనాలకు జరిమానా

కారు, ఇతర ఫోర్‌వీలర్లకు ఉన్న నలుదిక్కుల డోర్, విండో అద్దాలపై ఏర్పాటు చేసుకునే బ్లాక్‌ఫిల్మ్‌లు ప్రమాణాల ప్రకారం ఉన్నాయా?లేవా? అనేది నిర్ధారించేందుకు కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులకు ఇప్పటి వరకు టింట్ పరికరం అందుబాటులో లేదు. పాత విధానంలోనే అప్పుడప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కారు అద్దాలు పూర్తిగా నల్లగా ఉన్నవాటికి జరిమానా విధించేవారు. ఇటీవల కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులకు అన్నిరకాల డిజిటల్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక టింట్ మీటర్ కూడా కరీంనగర్‌కు రావడంతో నెల రోజులుగా కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ప్రమాణాలను ఉల్లంఘించిన వాహనాలకు జరిమానా విధిస్తున్నారు. నెల రోజుల్లో 43 కార్లకు జరిమానా విధించారు. ఆ వాహనాలకు ఏర్పాటు చేసుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను వాహన డ్రైవర్, యజమానులతో తొలగింపజేశారు. ప్రతివాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సెమినార్లతో నిబంధనలపై అవగాహన



శిక్షణ పొందుతున్న టెక్నికల్ అఫీషియల్స్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జడ్జింగ్ సెమినార్లతో నిబంధనలపై అవగాహన వస్తుందని ఉషు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాల మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫండస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి ఉషు జడ్జింగ్ సెమినార్‌ను ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 50 మందికిపైగా టెక్నికల్ అఫీషియల్స్ ఈ సెమినార్‌లో పాల్గొన్నారు. సెమినార్‌ను ప్రారంభించిన జాల మనోహర్ మాట్లాడుతూ క్రీడలో ఎప్పటికప్పుడు మారుతున్న నియమ నిబంధనలను తెలుసుకుని జడ్జింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ఇలాంటి సెమినార్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి హాజరైన టెక్నికల్ అఫీషియల్స్‌కు న్యాయనిర్ణేతలు వేసే పాయింట్ల విభజన, శిక్షణలో అవసరమున్న మెటీరియల్, వాటి వాడకం, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఉషు సంఘం రాష్ట్ర అఫీషియల్స్ మహ్మద్ ఇమ్రాన్, ఇర్ఫాన్, పరమేష్, అతిథులుగా ఫండస్ పాఠశాల చైర్మన్ గోపు ప్రభాకర్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా నాయకులు గోపు సుశాంక్‌రెడ్డి, బార విద్యాసాగర్, కోడూరి శేఖర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్, పీడీ శంకరయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల డీఏ బకాయిలు విడుదలచేయాలి



సమావేశంలో మాట్లాడతున్న చెన్నమనేని వెంకటరామారావు

భగత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల డీఏ బకాయిలు విడుదల చేయాలని పోస్టల్, ఆర్‌ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నమనేని వెంకటరామారావు కోరారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోస్టల్, ఆర్‌ఎంఎస్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం కరీంనగర్ ప్రధాన తపాల కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు నిలిపి వేసిన 36 డీఏ ఇన్‌స్టాల్‌మెంట్లను విడుదల చేయక పోవడం బాధాకరమన్నారు. వృద్ధులు, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే టికెట్ రాయితీ రద్దు చేసి ఇంత వరకు పునరుద్ధరించలేదన్నారు. దేశ ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉండి జీఎస్టీ వసూళ్లు పెరిగినా పెన్షనర్లకు న్యాయంగా రావాల్సిన డీఏలు విడుదల చేయకపోవడం శోచనీయన్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా కొండపాక చంద్రమోహన్‌రావును ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి జలాలుద్దీన్, ఎం లక్ష్మీపతి, రాష్ట్ర కార్యనిర్వాహక వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల రామేశం, కార్యదర్శి ఎం రాజయ్య, కోశాధికారి వై చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి

భగత్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి తిరుపతి విమర్శించారు. ఆదివారం నగరంలోని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఐఐటీ, నీట్, ఈ టెక్నో, ఒలంపియాడ్ ఇలా పేర్లు పెట్టుకున్న విద్యాసంస్థలు తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలు యూనిఫామ్స్, అడ్మిషన్, బుక్స్, టై, బెల్టులు, షూస్‌లు, హాస్టల్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. జిల్లా అధికారులు స్పందించి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు అభిరామ్, రాకేష్, సంపత్, నిశాంత్‌రెడ్డి, రాహుల్ పాల్గొన్నారు.

విడతల వారీగా రైతు భరోసా నిధులు

హుజూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వ్యవసాయ పెట్టుబడి కోసం రైతు భరోసా నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసిందని హుజూరాబాద్ ఏడీఏ సునీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత పంట కాలల్లో రైతు భరోసా నిధులు జమ చేసిన బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తారన్నారు. బ్యాంకు ఖాతా పని చేయని రైతులు, బ్యాంకు ఖాతా మార్చాలనుకునే రైతులు సంబంధిత ఏఈవోలను కలవాలన్నారు. పాత పట్టాదారులు తిరిగి దరఖాస్తు చేయనవసరం లేదన్నారు. ఈ నెల 5వ తేదీ లోపు పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందన్నారు. నూతనంగా పట్టాదారు పుస్తకాలు పొందిన రైతులు వారి బ్యాంకు బుక్, ఆధార్‌కార్డు, నూతన పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌లు దరఖాస్తు ఫారంతో ఈ నెల 20లోపు ఆయా వ్యవసాయ క్లస్టర్‌లో ఏఈవోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.



బీజేపీ దేశ దిశ..దశను మార్చింది

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ప్రజలు విశ్వసించరు
- రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు

కరీంనగర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలోనే భారత దేశ దిశదశ మార్చిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో నిర్వహించిన మండల సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం భారత వైభవాన్ని విశ్వ వేదికపై నిలబెట్టిందన్నారు. సేవ, సుపరిపాలన, పేదల సంసక్షేమమే లక్ష్యంగా, వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రధాని మోదీ పరిపాలన విజయవంతంగా కొనసాగుతుందన్నారు. జరిగిన ఆపరేషన్ సిందూర్‌తో నాయకత్వం అంటే ఏమిటో దేశానికి, ప్రపంచానికి ప్రధాని మోదీ చూపించారన్నారు. ప్రజా ఆశీస్సులతో తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రజలందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని అయిపోయిందని తెలిపారు. బీఆర్ఎస్ అవుడేటెడ్ పార్టీ అని తెలంగాణలో ఈ రెండు పార్టీలను ప్రజలు విశ్వసించరన్నారు. కార్యక్రమంలో గాండ్ల గోపాల్, దూడం రమేష్, కూకట్ల రమేష్, దూడం శ్రీనివాస్, గుర్రం కమలాకర్‌రెడ్డి, ఎండీ అఫ్రోజ్, శివారెడ్డి, దీపక్, తేజ, సృజన్, సునీల్, శ్రీనివాస్, దేవేందర్, రమేష్, సంజీవ్, అమరేందర్, మాధవ్, రాజు, మహేష్ నగేష్, ప్రదీప్ రెడ్డి, శ్రీనివాస్, మారుతి, వికాస్, వినయ్, అజయ్, సచిన్, సంజయ్,అభిలాష్, అనిల్, వెంకటేష్, క్రమ్, విజయ్, మల్లేష్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్రకౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్ జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీ డీసీఎల్ మైదానంలో ఐదు రోజులపాటు నిర్వహించిన బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో టీజీఎన్‌పీడీ సీఎల్ ఎస్ఈ రమేశ్‌బాబు మాట్లాడుతూ క్రీడలను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు నైపుణ్యాలు పెంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో టీజీఎన్‌పీ డీసీఎల్ ఏ జట్టు నిలవగా, రన్నరప్‌గా టీజీఎన్‌పీడీసీఎల్ బీ జట్టు నిలిచింది. అండర్-19 బాలుర విజేతగా హుజూరాబాద్ జట్టు, రన్నరప్‌గా టీజీఎన్‌పీడీసీఎల్ జట్టు నిలిచాయి. ఉత్తమ క్రీడాకారులుగా భద్రబిభేష్, త్రినేష్ ఎంపికయ్యారు. అతిథులు వీరికి ట్రోఫీలను, మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ఉపేందర్, ఏడీఈలు ఈఎల్‌పీ రాజు, సుధీర్ కుమార్, అనిల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్‌రావు, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల కరస్పాండెంట్ సంతోష్‌రెడ్డి, నిర్వాహకులు జీవన్‌కుమార్, భార్గవ్, వినీల్, సునీల్ కుమార్, టీజీఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేస్తున్న అధికారులు

ఉద్యమకారుల ఆధ్వర్యంలో చండీ యాగం

తిమ్మాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ తాపాల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో తెలంగాణ ప్రజలు బాగుండాలని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రెండు రోజులుగా చండీ యాగం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు తిరునగిరి వెంకటాద్రి ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కనకం కుమారస్వామి మాట్లాడుతూ రెండు రోజులుగా చండీ యాగం చేస్తున్నామని తెలిపారు. కార్య క్రమంలో ఆలయ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంకిడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, ఉద్యమ కారుల ఫోరం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



మహాత్మానగర్‌లో చండీయాగం నిర్వహిస్తున్న ఉద్యమ కారులు

‘ఉపాధి హామీ’లో పండ్లతోటలకు ప్రోత్సాహం



ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు

కరీంనగర్ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల తోటలు విరివిగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండల వ్యాప్తంగా ఈ యేడాది 50 ఎకరాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలం 6,605 జాబ్ కార్డులు ఉన్నాయి. 9,800 మంది కూలీలు ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి మండలవ్యాప్తంగా పండ్ల తోటలను పెంచేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రణాళిక రూపొందించింది. ఒక్కో రైతు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు పండ్ల తోటలను పెంచేందుకు ప్రోత్సహిస్తోంది. ఎకరానికి 70 నుంచి 160 మొక్కల చొప్పున రైతులకు అందించనున్నారు. జామ, మునగ, సీతాఫలం, కొబ్బరి, నిమ్మ, మామిడి, డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగు చేసేందుకు అవకాశం ఉంది. మొక్కల కొనుగోలుకు రైతులు తమకు నచ్చిన నర్సరీలను ఎంపిక చేసుకోవచ్చు. లేకపోతే ప్రభుత్వం ఎంపిక చేసిన నర్సరీల నుంచి తెచ్చుకోవచ్చు. రైతులు స్వయంగా కొనుగోలు చేస్తే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుల ఆధారంగా మొక్కలను అందజేయనున్నారు. ఇప్పటి వరకు 22 మంది దరఖాస్తు చేశారు. వీరు 27 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచడానికి ముందుకు వచ్చారు.




జామ తోట

సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

పండ్ల తోటల పెంపకానికి సంబంధించి మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వేందుకు జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా రైతులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. నాటిన మొక్కలు ఎదిగేలా మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చు ప్రభుత్వం ఇస్తుంది. అయిదు ఎకరాల్లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్న కారు రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. సాగునీటి వసతి ఉన్న భూములకు ఈ పథకం వర్తిస్తుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి...

- శోభరాణి, ఏపీవో



ప్రభుత్వం కల్పించిన పండ్ల తోటల పెంపకం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ నిధులతో చేపట్టే ఈ పథకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. నీటి వసతి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. తోటలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

హుజూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఆదివారం గోస్కుల ముత్యంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2022 నుంచి లీవ్‌లకు సంబంధించి, 2017 ఏరియాస్ పేస్కేల్‌లో రావాల్సిన బకాయిలు ఇప్పటి వరకు రాలేదన్నారు. వెంటనే బకాయిలను యాజమాన్యం ఇవ్వాలన్నారు. జూలై 20న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రంగు పండరి, మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, నర్సయ్య, రఘుపతి, సంజీవ్, నారాయణ, శ్రీను, రవీందర్ పాల్గొన్నారు.

మసీదు కమిటీ ఎన్నిక

జమ్మికుంట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిపల్లి గ్రామ మసీదు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ యాకూబ్, అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రజాక్, సెక్రెటరీగా మహమ్మద్ సాదిక్, కోశాధికారిగా మహమ్మద్ రహమాన్, సలహాదారులుగా మహ్మద్ అజ్మీర్, కమిటీ సభ్యులుగా అల్లావుద్దీన్ జాఫర్, చాంద్‌పాషా, రియాజ్, నబిసాబ్, అజీజ్ ఎన్నికయ్యారు.

శరవేగంగా జాతీయ రహదారి పనులు

- కరీంనగర్-వరంగల్ మధ్య కిలోమీటర్ రోడ్డు పనులకు రూ. 37కోట్లు
- 80శాతం పూర్తయిన బైపాస్ పనులు

హుజూరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు శరవేగంగా నడుస్తున్నాయి. గతంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్, వరంగల్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర అసౌకర్యాలకు గురయ్యేవారు. ప్రస్తుతం పనులు వేగవంతమయ్యాయి. 36 ఏళ్ల క్రితం ఇర్కాన్ సంస్థ నిర్మించిన కరీంనగర్-వరంగల్ రహదారి పూర్తిగా గుంతలమయమైంది. దీనిని దృష్టిలో



కరీంనగర్-వరంగల్ నేషనల్ హైవే

పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్-563 నాలుగు వరుసల రహదారికి ఆమోదం తెలిపింది. ఎన్‌హెచ్-563 రహదారి పనులు ప్రస్తుతం వేగంగా నడుస్తున్నాయి. కిలోమీటర్ రహదారి నిర్మాణానికి రూ. 37కోట్లు ఖర్చు పెట్టి పనులు చేస్తున్నారు. కరీంనగర్- వరంగల్ నాలుగువరుసల రహదారి పనుల కోసం కేంద్రప్రభుత్వం సుమారు 16,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసింది. ఈ రెండు జిల్లాల మధ్య 68 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న రహదారి పనులు ఊపందుకున్నాయి. ఈ డిసెం బరు నాటికి రహదారి పనులు పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) సూచించింది. భూసేకరణ అనంతరం రెండేళ్ల నుంచే కరీంనగర్-వరంగల్ సెక్షన్లలో పనులు మొదలయ్యాయి. భూసేకరణలో చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని రెవెన్యూ



హుజూరాబాద్ శివారులో నిర్మిస్తున్న బైపాస్ బ్రిడ్జి

అధికారులు రైతులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు. శంకరపట్నం మం డలం కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో టోల్‌గేట్ పనులు చకచకా జరుగుతున్నాయి. కెనాల్ బ్రిడ్జిపై వంతెనలు, కల్వర్టులు, మేజర్, మైనర్ జంక్షన్లు, బైపాస్ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా ఎత్తయిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. డ్రైవర్ల విశ్రాంతి కోసం ట్రకేవే నిర్మిస్తున్నారు. హుజూరాబాద్, శంకరపట్నం మండలాల నుంచి వాహనాలు రాకతో ఇబ్బందులు అవుతున్నాయనే దృష్ట్యా పట్టణాలకు రాకుండా తాడికల్ నుంచి మొలంగూర్ వరకు ఏడు కిలోమీటర్లు, సింగాపూర్ నుంచి చిన్నపాపయ్యపల్లి వరకు 15కిలోమీటర్లు బైపాస్ నిర్మాణం చేపడుతున్నారు. దాదాపుగా బైపాస్ పనులు 80శాతం వరకు పూర్తయ్యాయి. గ్రామాలు ఉన్న చోట ఇరువైపులా సర్వీస్ రోడ్లను వేస్తున్నారు. గతంలో వరంగల్-కరీంనగర్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రోడ్డుపనులు శరవేగంగా జరుగుతుండడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు వరకు పనులు పూర్తయితే వరంగల్-కరీంనగర్ మధ్య ప్రయాణం సులభం కానుంది.

మా కష్టాలు తీరనున్నాయి..

- పిల్లి సమ్మయ్య, వాహనదారుడు, హుజూరాబాద్



కరీంనగర్, వరంగల్ నాలుగు వరుసల జాతీయ రహదారి పనులు పూర్తయితే మా కష్టాలు తీరుతాయి. ఇప్పటి వరకు 80శాతం వరకు రహదారి బైపాస్ పనులు పూర్తయ్యాయి. గతంలో వరంగల్, కరీంనగర్ రహదారి గుంతలమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జాతీయ రహదారి పూర్తయితే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- ఎనిమిది మందికి గాయాలు
- కోరుట్ల
- గణపతి విగ్రహ తయారీ కేంద్రం వద్ద ప్రమాదం



అల్వాల వినోద్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)







సంఘటనా స్థలంలో సొమ్మసిల్లి పడిపోయిన కూలీలు, జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కోరుట్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గణపతి విగ్రహాల తయారీ కేంద్రం వద్ద ఆదివారం విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో విగ్రహాల తయారీ కేంద్రం నిర్వాహకుడు అల్వాల వినోద్(32), కూలీ సాయికుమార్(29) మృతిచెందారు. కోరుట్ల పట్టణ శివారులో ఉన్న శ్రీబాలాజీ వినాయక విగ్రహ తయారీ కేంద్రంలో భారీ వినాయక విగ్రహాన్ని కేంద్ర నిర్వాహకుడు అల్వాల వినోద్ మరో తొమ్మిది మంది కూలీలతో కలిసి తోపుడు బండి సహాయంతో మరో షెడ్‌కు తరలిస్తుండగా ప్రమాదం జరిగింది. విగ్రహం తడిగా ఉండడంతో అదే ప్రాంతంలో ఉన్న 33/11 కేవీ లైన్ తగిలి విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో తోపుడు బండి తోస్తున్న వారు విద్యుదాఘాతానికి గురై ఒక్కసారిగా ఎగిరిపడ్డారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా అల్వాల వినోద్, సాయికుమార్ మృతిచెందారు. మిగిలిన ఎనిమిది మంది కూలీలు అల్వాల నితిన్, వెంకటరెడ్డి, రాజేష్, వేల్పుట్ల సాయికృష్ణ, హన్మంత్, ఆకాష్, రోషన్, హరద్ తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ ఆసుపత్రులకు తరలించారు. సంఘటనలో గాయ పడిన వారిలో ఇద్దరు ఉత్తరప్రదేశ్, ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారు కాగా మిగతా నలుగురు స్థానికులు ఉన్నారు. క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రిలో కలెక్టర్ సత్యప్రసాద్ పరామర్శించారు.

● తోపుడు బండికి ఓ చక్రం లేకపోవడంతో ప్రమాదం

భారీ విగ్రహాన్ని తరలిస్తున్న తోపుడు బండికి ఒక వైపు చక్రం లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. తోపుడు బండికి ఒక వైపు చక్రం లేకపోవడంతో పాటు ఆ ప్రాంతం ఎత్తుపల్లాలు ఉండడంతో ఒక్కసారిగా విగ్రహం ఒక వైపు వంగి మీద ఉన్న విద్యుత్ తీగకు తగిలినట్లు విద్యుత్, పోలీసు శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

● విద్యుత్ లైన్ కిందికి ఉండడంతో..

11/33 కేవీ లైన్ పూర్తిగా కిందికి ఉండడంతో ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న జగ్గాసాగర్, వల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా చేసే లైన్ పూర్తిగా కిందికి ఉండడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది.

● కోరుట్లలో పట్టణంలో విషాదం

కోరుట్ల రూరల్: పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన అల్వాల వినోద్, ఏసీకోనిగుట్ట ప్రాంతానికి చెందిన సాయికుమార్ మృతి చెందడంతో విషాదం నింపింది. వినోద్‌కు భార్య శైలజతో పాటు ఇద్దరు కూతుర్లు ప్రణయ, శ్రీయాశీలు ఉన్నారు. ఏసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన వెలుల్ల వెంకటి-రేఖ దంపతులకు ఇద్దరు కొడుకులు కాగా పెద్దకుమారుడు సాయికుమార్ ప్రమాదంలో మృతిచెందాడు. చిన్న కుమారుడు సాయికృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

పట్టణంలో జరిగిన ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పరిశీలించారు. సంఘటన వివరాలను కోరుట్ల, మెట్‌పల్లి సీఐలు సురేష్‌బాబు, అనిల్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, విద్యుత్ ఏడీఈ రఘుపతిని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

● క్షతగాత్రులకు పరామర్శ

జగిత్యాల (ఆంధ్రజ్యోతి): క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సత్య ప్రసాద్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు వేర్వేరుగా పరామర్శించారు. బాధితులకు అందుతున్న చికిత్సను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ కృష్ణ, సాయినాథ్, ఆకాష్, హనుమంతు అనే నలుగురిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు బాధితులను జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

● ప్రమాద వివరాలను తెలుసుకున్న ఎమ్మెల్యే

ప్రమాదంపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఫోన్ ద్వారా పోలీసు అధికారులతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్సను అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వ తరఫున ఎక్స్‌గ్రేషియా అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

● గాయపడిన వారికి మెరుగైన చికిత్స

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కోరుట్ల, (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో విద్యుదాఘాతానికి గురైన వారికి ప్రభుత్వం తరఫున మెరుగైన చికిత్స అందిస్తామని, మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందే విధంగా చర్యలు తీసుకుంటాని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కోరుట్ల పట్టణంలో జరిగిన సంఘటనపై మంత్రి ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రమాద ఘటనపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

ఉరివేసుకుని రైతు ఆత్మహత్య



దుద్దెడి శంకర్(ఫైల్)

గంభీరావుపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన దుద్దెడి శంకర్(55) అనే రైతు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్ తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. మరోవైపు రెండు ఎకరాల మామిడి తోట కూడా కౌలుకు తీసుకున్నాడు. ఇటీవలే ఒక కొడుకు పెళ్లి చేశాడు. వరి పంటలో ఆశించిన దిగుబడి రాకపోవడం, మామిడితోటలో నష్టం రావడంతో పాటు అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. వీటికి తోడు కొడుకు పెళ్లికి చేసిన అప్పుల బాధ ఎక్కువైంది. అన్నీ కలిపి నాలుగు లక్షల రూపాయల వరకు అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన శంకర్ శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రంతా శంకర్ కోసం కుటుంబసభ్యులు గాలించారు. పొలం వద్ద చెట్టుకు శంకర్ ఉరివేసుకుని మృతిచెందాడని ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి భార్య పద్మ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ప్రేమానందం సంఘటన స్థలానికి పరిశీలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

కారు, గ్రానైట్ లారీ ఢీ.. నలుగురికి గాయాలు

కరీంనగర్ క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని తీగలవంతెనపై ఆదివారం వేకువజామున కారు, గ్రానైట్ లారీ ఢీన్న ఘటనలో నలుగురికి గాయాలైనట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సదాశివపల్లి వైపు నుంచి కరీంనగర్‌కు వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీని ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయని, స్థానికులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారని తెలిపారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం, కుడి పక్క, లారీ ముందుభాగం ధ్వంసమయ్యాయని, ఘటనపై ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

దొంగిలించిన రాగితీగను పట్టుకున్న రైతులు



వెల్లుల్లలో పట్టుకున్న రాగితీగను అధికారులకు అప్పగిస్తున్న రైతులు

మెట్‌పల్లి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ రోడ్డులో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన రాగితీగను రైతులు ఆదివారం పట్టుకుని అధికారులకు అప్పగించారు. గ్రామంలోని రైతులు పొలం పనులకు సాయంత్రం వెళ్తుండగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన రాగితీగను సంచిలో ఉంచి ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. రైతులు గమనించి వారిని ప్రశ్నించగా పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో రైతులు వెంబడించగా ద్విచక్రవాహనం, సంచిని వదిలి పారిపోయారు. సంచి పరిశీలించగా దొంగిలించిన రాగితీగ కనిపించగా వెంటనే పోలీసులు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ ఏడీఏ మనోహర్, ఎస్సై-2 రాజునాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని రాగితీగ, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న రైతులను అధికారులు అభినందించారు.

మతిస్థిమితం సరిగా లేక మహిళ బలవన్మరణం

గొల్లపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపేట గ్రామంలో మతిస్థిమితం సరిగా లేని మహిళ ఓ వ్యవసాయ బావిలో దూకి ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. బాధిత కుటుంబసభ్యులు, ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్కాకుల లక్ష్మి (49) అనే మహిళ కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయింది. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించినా జబ్బు నయం కాలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి జీవితం మీద విరక్తి చెంది గ్రామ రెవెన్యూ పరిధిలోని ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు లక్ష్మి భర్త రాజమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



విచారణ జరుపుతున్న ఎస్సై సతీష్ కుమార్

రాజన్న ఆలయ ఈవో కార్యాలయం ఎదుట ఆందోళన

- వేధింపులతోనే కొడుకు మృతిచెందాడని ఆరోపణ

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో విధులు నిర్వర్తించే ఇద్దరు అధికారుల వేధింపులతోనే తన కొడుకు మృతిచెందాడని మృతుడి తల్లి పెంట లక్ష్మి బంధువులు, కాలనీవాసులతో కలిసి ఈవో కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళన నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో ఇంజనీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న పెంట ఓంకార్ (30) 15 రోజులు క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజనీరింగ్ విభాగంలోని ఓ ఉద్యోగి తన సొంత పనులకు ఓంకార్‌ను వాడుకున్నారని, మరో ఉద్యోగి ఓంకార్‌ను విధులకు రావడం లేదని గైర్హాజర్ వేసి ఉద్యోగం నుంచి తొలగిస్తామని వేధించారన్నారు. అంతే కాకుండా రాతపూర్వకంగా క్షమాపణ పత్రం రాయించుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఓంకార్ మే 30వ తేదిన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

దీంతో మృతుడి తల్లి ఆదివారం ఈవో కార్యాలయం ఎదుట బంధువులు, కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఆలయాధికారులు అక్కడకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి ధర్నా విరమించారు.



ఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఓంకార్ బంధువులు, కాలనీవాసులు

అదనపు కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

● మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుట్ట గ్రామంలో అదనపు కట్నం కోసం కుటుంబసభ్యుల వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన బిగుల్ల లక్ష్మి-పరుశరాముల కూతురు నవ్య (23)కు శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు కళ-సమ్మయ్య కుమారుడు సందీప్‌తో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో లాంఛనాలతో పాటు లక్షరూపాయల కట్నం కింద సందీప్‌కు అప్పగించారు. పెళ్లి అయిన తర్వాత మొదటి కుమారుడి ఆస్పత్రి ఖర్చులు తల్లిగారు భరించారు. కాగా కొంతకాలం తర్వాత రూ. 50వేలు అదనపు కట్నం కావాలని అడగగా నవ్య పుట్టింటి వారు ఇచ్చారు. రెండో కుమారుడు జన్మించిన తర్వాత కూడా అదనపు కట్నం కోసం వేధించడంతో మరొక రూ. 50వేలు అందించినట్లు తెలిపారు. కొంతకాలం తర్వాత రెండు లక్షల అదనపు కట్నం కోసం వేధించడంతో నవ్య తన కుమారులతో మెట్‌పల్లికి వెళ్లింది. ఈ నెల 13న సందీప్ ఫోన్ చేసి ఇక నుంచి మంచిగా ఉంటానని చెప్పడంతో నవ్య కుటుంబసభ్యులు వారి కుమారుడు హర్షవర్ధన్‌తో నవ్యను అత్తారింటికి బస్సు ఎక్కించి పంపించారు. నవ్య చేరిన విషయం తెలుసుకోవడానికి సందీప్‌కు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని తెలిపారు. ఈ నెల 14న రాత్రి రెండో అల్లుడు బూర్ల వంశీకి ఫోన్ చేసి నవ్య ఉరేసుకుందని కరీంనగర్ సివిల్ ఆస్పత్రిలో చనిపోయిందని సందీప్ సమాచారం అందించాడు. కాగా శనివారం నవ్య అదనపు కట్నం వేధింపులు భరించలేక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా అత్తింటి వారు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించి, నవ్య మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. నవ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని, తగిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లి లక్ష్మి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

వేములవాడలో కూల్చివేతలు ప్రారంభం

- రోడ్ల వెడల్పులో భాగంగా నిర్మాణాల తొలగింపు
- మెయిన్ రోడ్డులో 144 సెక్షన్ అమలు

వేములవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పు ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాల తొలగింపు చేపట్టారు. రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ముందుభాగం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు, ఇందుకోసం రోడ్డుకు ఇరువైపులా సేకరించాల్సిన ఇళ్లు, భవనాలను గుర్తించారు. 240 మందికి పైగా నిర్వాసితులుగా గుర్తించిన ప్రభుత్వ యంత్రాంగం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇప్పటికే 60 మందికి పరిహారం చెల్లించింది.

కొందరు రోడ్ల వెడల్పును సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా వారికి సంబంధించిన చెక్కులను అధికారులు కోర్టులో డిపాజిట్ చేశారు. రోడ్ల వెడల్పుల్లో నష్టపరిహారం కోసం 47 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేయగా, సాధ్యమై నంత త్వరలో రోడ్ల వెడల్పు ప్రారంభించాలన్న లక్ష్యంతో ఆదివారం తొలు త స్థానిక పుర పాలక సంఘానికి చెందిన మటన్ మార్కెట్ ప్రాంగణాన్ని ఎక్స్‌కావేటర్ సహాయంతో అధికారులు



మెయిన్ రోడ్డు వద్ద గుమిగూడిన స్థానికులు

కూల్చివేశారు. ప్రధాన రోడ్డు వెంబడి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన వాణిజ్య సముదా యం ఉండగా దానిని సోమవారం కూల్చివేయనున్నారు. సోమవారం ఉదయం నుంచి మూడు నాలుగు రోజుల్లోగా రోడ్డుకు ఇరువైపులా సేకరించిన భవనాలను కూల్చివేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇళ్లు, భవనాలు ఖాళీ చేయాల్సిందిగా ఇప్పటికే యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు చాలామంది తమ ఇళ్లను ఖాళీ చేయకపోవడంతో సోమవారం తెల్లవారుజాము వరకు ఖచ్చితంగా ఖాళీ చేయాలంటూ అధికారులు ఆదివారం స్పష్టం చేశారు. లేనిపక్షంలో తామే బలవంతంగా తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

రోడ్ల వెడల్పులో భాగంగా కూల్చివేతల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు రాజన్న ఆలయం ముందు భాగం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు సోమవారం ఉదయం నుంచి 144 సెక్షన్ విధిస్తూ తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్ల వెడల్పులో సేకరించిన ఇళ్లు భవనాలకు కూల్చివేతకు సంబంధించిన పనులు పర్యవేక్షించేందుకు పలు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే తాము ఇళ్లు ఖాళీ చేయకముందే బలవంతంగా కూల్చివే తకు సిద్ధం కావడం సరైనది కాదని, ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా నిర్వహి స్తున్న దుకాణాలను, వాటిలోని సామగ్రిని తరలించడానికి కొంత సమ యం ఇవ్వాలని వ్యాపారులు కోరుతున్నారు.

సమైక్య సాహితి పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తదితరులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం సమైక్య సాహితి తరపున నాన్నల విశిష్ట పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యా సంస్థల జాయింట్ సెక్రెటరీ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ నాన్న కుటుంబానికి మార్గదర్శి అని, పిల్లల సంపూర్ణ శారీరక, మానసిక, నైతిక మూర్తిమత్వానికి ఆయన ప్రధాన కారకుడని అన్నారు. జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ప్రదాతగా ఆచార్య రజనీశ్రీ నృత్య పురస్కారం డాక్టర్ పేరిణి కుమార్‌కు, కేఎస్ అనంతాచార్య ప్రదాతగా కలకుంట్ల సంపత్కుమారాచార్య సంగీత పురస్కారం లక్ష్మీ శేషాచార్యులకు, రావికంటి శ్రీనివాస్ ప్రదాతగా రావికంటి రామయ్యగుప్త సాహితీ పురస్కారం డాక్టర్ వరుకుల రంగాచార్యకు, మాడిశెట్టి గోపాల్ ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం బెజ్జారపు వినోద్‌కుమార్‌కు, డాక్టర్ రఘురామన్ ప్రదాతగా డాక్టర్ దారం నాగభూషణం పరిశోధక పురస్కారం ఆచార్య అడపా సత్యనారాయణకు అందజేశారు. ఒక్కొక్కరికి పురస్కారం కింద శాలువా, ప్రశంసాపత్రం, 5వేల రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ప్రధానకార్యదర్శి కెఎస్ అనంతాచార్య, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్‌కుమార్, డాక్టర్ టీవీఎస్ స్వామి, గాజుల రవీందర్, అనుప, డాక్టర్ శ్రీనివాసాచార్య, నాగేంద్రశర్మ, సుజనాదేవి పాల్గొన్నారు.

● సమైక్య సాహితి పురస్కార కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ తాను స్వీకరించిన ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్ గద్దర్ అవార్డు కరీంనగర్ ప్రజలకు అంకితం ఇస్తున్నట్లు తెలిపారు.

సాహిత్యంలో రాణిస్తున్న అనూశ్రీ

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు



కవయిత్రి గౌరోజు అనూశ్రీ

కోల్‌సిటీటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన గౌరోజు అనూశ్రీ పలు రచనలు చేస్తోంది. కవితా సంపుటి, సంకల నాలతో సాహిత్య రంగంలో తన కంటూ ప్రత్యేకతను చాటు కుం టూ ఎన్నో కవితలు, కథలు, గేయాలు, సమీక్షలను రాసింది. పలు పురస్కారాలు అందు కుం టూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించింది. అసలు పేరు కృపారాణి. ఆమె కలం పేరు అనూశ్రీ. నాన్న పొడిశెట్టి బిక్షపతి సింగరేణిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. భర్త రవీంద్రాచారి స్వర్ణకార వృత్తి. కృపారాణి(అనూశ్రీ)కి చిన్ననాటి నుంచి సాహిత్యంపై మక్కువ. తండ్రి బిక్షపతిచారి సింగరేణిలో కార్మికుడిగా పనిచేస్తూనే శ్రామికులు, శ్రమశక్తిపై అనేక పాటలు రాసే వారు. మేనమామ నాగభూషణం కూడా సాహితీవేత్త. అలా అనూశ్రీ సాహిత్యమంటే ఇష్టంగా మారింది. గృహిణిగా ఉంటూనే ఎన్నో కవితలు, రచనలు చేస్తున్నది.



అనుశ్రీ రాసిన గగనం పుస్తకావిష్కరణ చేస్తున్న సుద్దాల అశోక్‌తేజ్

● వచనకవితలు... రచనలు...

అనూశ్రీ కలం నుంచి ఎన్నో కవితలు, రచనలు జాలు వారాయి. ఇప్పటి వరకు సుమారు 3వేలకు పైగా వచన కవితలు, 60కథలు, 6 నవలలు, 300 సమీక్ష రచనలు చేశారు. 2020లో కెరటం తొలి(కవితా సంపుటి), 2021లో తేనెపలుకు(సరళ శతకం), 2022లో గగనం(కవితా సంపుటి), 2022లో దోసిట్లో చందమామ(భావ కవిత్వం), 2022లో శ్రీపద సౌరభం(శ్రీపద సకలనం), 2023లో వేద నవల, 2024లో జగతి నవల ప్రశంసలు అందుకున్నాయి. అలాగే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో మూడుసార్లు చోటు దక్కింది.



అనూశ్రీకి సత్కారం

● ఎన్నో అవార్డు... ప్రశంసలు

అనూశ్రీ కలం నుంచి జాలువారిన కవితలు, రచనలు, సమీక్షలకు ఎన్నో పురస్కారాలు లభించాయి. సాహిత్యరత్న, సాహిత్య సవ్యడి, కవితారత్న, కవితా భూషణ, కవితావిభూషణ, కవిచక్ర, సాహిత్య ప్రవీణ్య, కవిశ్రేష్ట, కవి మిత్ర, సహస్ర కవికిరణం, సాహితీభూషణం తదితర బిరుదులు, తెలుగు వెలుగు పురస్కారం అందుకున్నారు. తొలి పుస్తకానికి అంగలకుదుటి పురస్కారం, గిడుగు రామమూర్తి పురస్కారం, లింగుట్ల లక్ష్మీనరసమ్మ పురస్కారం, చంద్రబోస్ జీవిత సాఫల్య పురస్కారంతోపాటు అనేక చిత్ర, కవితల పోటీల్లో బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. గృహిణి బాధ్యతలను కొనసాగిస్తూనే తనకిష్టమైన సాహిత్యరంగంలో రాణిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు... గౌరోజు కృపారాణి(అనూశ్రీ).

దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

గణేశ్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో దశ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యిందని, ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో దశలో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 18లోగా దోస్త్ వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొన్నారు. సెల్ఫ్‌రిపోర్ట్ చేయకపోతే సీటు, రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందని తెలిపారు. ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ,పీజీ కళాశాల నాక్ చేత 'ఏ' గ్రేడ్ గుర్తింపు పొందినట్లు, స్వయం ప్రతిపత్తితో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో అత్యధిక విద్యార్హతలు, అపార అనుభవం ఉన్న అధ్యాపకులతో విద్యాబోధన సాగుతోందని తెలిపారు.

అత్యాధునిక వసతులతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్‌ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థి నులకు వసతి సౌకర్యం కలదని, చాలా మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందారని తెలిపారు. అధునాతన సబ్జెక్టులతో కూడిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఎస్సారార్ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.

నేడు ముల్కనూర్ బ్యాంకు ఎన్నికలకు నామినేషన్లు

- ఐదు డైరెక్టర్ స్థానాలకు పోటీ

భీమదేవరపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఐదు డైరెక్టర్ స్థానాల ఎన్నికలకు సోమవారం నామినేషన్లు వేయనున్నారు. ఇందుకోసం మే 24న ఎన్నికల అధికారి కోదండరాములు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ముల్కనూర్ బ్యాంకులో మొత్తం 15 డైరెక్టర్ స్థానాలు ఉండగా, అందులో ప్రతీ 20 నెలలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఐదు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఇందులో 1, 5, 9 వార్డులు ఇతరులకు, 2వ వార్డు ఎస్సీ, 15వ వార్డు మహిళలకు కేటాయించారు.

సోమవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు వేయనున్నారు. 17న నామినేషన్ పత్రాల పరిశీలన, 18న నామినేషన్ పత్రాల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం గుర్తుల కేటాయింపు జరుగుతుంది. ఓసీలకు రూ.వెయ్యి, బీసీలకు రూ.750, ఎస్సీ ఎస్టీలకు రూ.500ల చొప్పున నామినేషన్ రసుము చెల్లించాలి. ఈనెల 27న ముల్కనూర్ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరగనున్నట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు.

కిటకిటలాడిన ఆలయాలు.. భక్తుల పూజలు





వేములవాడలో రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, ధర్మపురిలో లక్ష్మీనర్సింహస్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రాజన్న ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం తీసి మొక్కులు చెల్లించుకున్నారు.

ధర్మపురి, (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి, గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భక్తులు కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు, సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొండగట్టులో జడ్జిని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

అంజన్న సేవలో న్యాయాధికారి

మల్యాల (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లా జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి పుష్పలత ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చిన న్యాయాధికారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, సిబ్బంది పాటు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ ఉన్నారు.

బోనమెత్తిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ముత్యంపేటలో మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట ఎస్సీ కాలనీలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని మహిళలతో కలిసి ఊరేగింపుగా పోచమ్మ ఆలయం వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మ్యాక లక్ష్మణ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, శనిగారపు తిరుపతి, సంత ప్రకాష్‌రెడ్డి, హరినాథ్, పొన్నం సాయి, నాగులపేట సంజీవ్, అనిల్, వెంకటేష్, బండి రవి, మనోజ్ పాల్గొన్నారు.

వేములవాడకు చేరుకున్న మంత్రి 'అడ్లూరి'

- నేడు రాజన్నను దర్శించుకోనున్న మంత్రి

- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మంత్రి అడ్లూరికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం రాత్రి చేరుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన మంత్రికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆదివారం రాత్రి ఆలయ గెస్ట్‌హౌస్‌లో బసచేసి సోమవారం ఉదయం రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకోనున్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఇన్‌చార్జి ఈవో రాధాబాయి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.


వైభవంగా పెద్దమ్మ బోనాలు

కొడిమ్యాల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెప్యాల గ్రామంలో ముదిరాజు కులస్తులు ఆదివారం సాయంత్రం పెద్దమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముదిరాజు కుల మహిళలు కుటుంబ సభ్యులతో, బంధువులతో ఇంటికొక్క బోనంతో మహిళలు గ్రామ కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి నెత్తిన బోనాలను ఎత్తుకొని గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్ళతో ఊరేగింపుగా వెల్లారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని కోరుకుంటు పెద్దమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలను అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు.

గంగాధర: గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, ర్యాలపల్లిలో ఆదివారం ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పెద్దమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కొడిమ్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత సంఘాల కులస్తులు ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దళిత కుల సంఘాల మహిళలు కుటుంబ సభ్యులతో, బంధువులతో ఇంటికొక్క బోనంతో గ్రామంలోని కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుండి నెత్తిన బోనాలను ఎత్తుకొని గ్రామ శివారులో ఉన్న పోచమ్మ ఆలయానికి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి, మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కుల సంఘం నాయకులు కొత్తూరి స్వామి, దేవయ్య, అజయ్, చిట్యాల స్వామి, నరేష్, శేఖర్, చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేష్, సభ్యులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ

కొడిమ్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేశం, సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు

వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్

- గర్రెపల్లిలో సీనియర్స్ వాలీబాల్ పోటీలు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ వాలీబాల్ పోటీలు సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించారు.

జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు కన్న రమేష్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని నలభై ఐదేళ్ల వయస్సు పైబడిన వాలీబాల్ క్రీడాకారులతో కలిసి పోటీలు నిర్వహించగా పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి రెండు వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతీ ఏటా ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్స్ వాలీబాల్ క్రీడాకారులకు పోటీలను గర్రెపల్లిలో నిర్వహిస్తున్నామని ఇది ఐదోసారి అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆసంపల్లి శ్రీనివాస్, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, కరీంనగర్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పడాల అజయ్ తదితరులు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా చూడాలన్నారు. వాలీబాల్ క్రీడకు ఉమ్మడి జిల్లాలో గర్రెపల్లి గ్రామం కీలకంగా ఉందన్నారు. కాగా ఈ పోటీల్లో విజేతగా కరీంనగర్ జిల్లా జట్టు నిలువగా రెండో స్థానంలో జగిత్యాల జిల్లా జట్టు నిలిచింది. కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లా, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు సీఏ విజ్ఞాన్ రావు, జూపల్లి తిరుమల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కళాకారులు

- ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

- కళాభారతిలో 'పాటల పల్లకిలో 12 గంటలు'





పాటలు పాడుతున్న గాయని తేలు విజయ, కళాకారులు, సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కళాకారులు కదం తొక్కారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. రచయిత, గాయకుడు నేర్నాల కిషోర్, టీపీసీసీ సాంస్కృతిక సేన అధ్యక్షుడు చక్రాల రఘు ఆధ్వర్యంలో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులు కరీంనగర్ కలెక్టరేట్ నుంచి ర్యాలీగా కళాభారతి చేరుకున్నారు. సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కళాభారతిలో కిషోర్, రఘు మాట్లాడుతూ సాంస్కృతిక సారథి సంస్థలో అసలైన కళాకారులకు న్యాయం జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి కళాకారులను ఆదుకోవాలని, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఉద్యమం పుట్టింది కరీంనగర్‌లోనేనని, అందుకే రాత్రి 10 గంటల వరకు 'పాటల పల్లకిలో 12 గంటలు' (ధూం...ధాం) కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. అంతకు ముందు అతిథిగా హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు న్యాయం చేస్తుందన్నారు. నాడు ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం కళాకారుల ఆటాపాటలు ఆలోచింపజేయడంతో పాటు అలరించాయి. సీనియర్ కళాకారులు మురళి మధు, వడ్లకొండ అనిల్‌కుమార్, ఆకునూరి దేవయ్య, బుర్ర నటరాజ్, శాంతిరాజ్, తేలు విజయ, ఏపూరి సోమన్న, వొల్లాల వాణి, జడల రమేష్, పొద్దుపొడుపు శంకర్, శంకర్‌బాబు, గుండేటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

గంగాధర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప సభను పార్టీ మండలాధ్యక్షుడు పంజాల ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 11 ఏళ్ల మోదీ పాలన దేశ ప్రజలకు అమృతం వంటిదన్నారు. పీఎం మోదీ హామీలన్నీ నెరవేర్చారని, దేశ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత ఉందని అన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, స్థానిక సంస్థల్లో వార్డు సభ్యుడి నుంచి జడ్పీటీసీ వరకు అవకాశమున్న ప్రతీ కార్యకర్త పోటీల్లో నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్, దూలం కల్యాణ్‌గౌడ్, మల్యాల వినయ్‌సాగర్, శశీధర్‌రెడ్డి, ఆకుల మనోహర్, ఇనుకొండ నర్సింహారెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్

రామడుగు: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు ఎం రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం రామడుగులో వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నబోయిన ఓదెలు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో దేశాన్ని అత్యున్నత స్థాయికి తీసుకువెళ్లిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ తిరుపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, పూరెల్ల శ్రీకాంత్, లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, మునిగంటి శ్రీనివాస్‌చారి, కారుపాకల అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల సంకల్ప సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు షైపాల్‌రెడ్డి, నర్సింహరాజు, ఆదిరెడ్డి, సమ్మిరెడ్డి, ప్రభాకర్, లింగారెడ్డి, శ్రీనివాస్, కుమార్, కొండాల్‌రెడ్డి, కుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఫటాఫట్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● మాధవి, ఏసీపీ, హుజూరాబాద్



ఆంధ్ర జ్యోతి: మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఏసీపీ: ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ముఖ్యంగా చదువుకునే యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి. ఎవరైనా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి: ఫిర్యాదు దారులకు మీరు ఇచ్చే సలహా ఏమిటి?

ఏసీపీ: నేరుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరగకపోతే సీఐ, ఆ తర్వాతనే పైఅధికారులను సంప్రదించాలి.

ఆంధ్రజ్యోతి: డ్రంకెన్ డ్రైవ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఏసీపీ: మద్యం తాగి వాహనాలు నడపరాదు. డివిజన్‌లో ఎక్కడికక్కడ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మైనర్లు వాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు.?

ఏసీపీ: పద్దెనిమిదేళ్లలోపు వారు వాహనాలు నడిపితే యజమానులపై కేసులు నమోదు చేస్తాం.

– హుజూరాబాద్

విద్యార్థులకు పోటీలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రకాశం గంజ్ వరసిద్ధి వినాయకస్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం దారం సుశీల ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ రఘురామన్ సౌజన్యంతో ఎనిమిదేళ్ల లోపు విద్యార్థులకు గణపతి 21 నామాలపై, 9 నుంచి 13 సంవత్సరాల విద్యార్థులకు గణేశ పంచరత్న మాలపై మౌఖిక పోటీలు నిర్వహించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులతో పాటు 2 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అర్చకుడు మంగళంపల్లి వేణుగోపాలశర్మ అంద జేశారు. సోమవారం ఉదయం గణపతికి ఫలరస పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, అర్చన, హారతి, అనంతరం తీర్థప్ర సాద వితరణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మంత్రిని కలిసిన ముస్లిం విద్యావంతుల వేదిక ప్రతినిధులు

కరీంనగర్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముస్లిం విద్యావంతుల వేదిక ప్రతినిధి ప్రధాన కార్యదర్శి రియాజ్ అలీ రిజ్వీ, కాంగ్రెస్ నాయకులు ఎస్ఏ మొసిన్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు సయ్యద్ హబీబుద్దీన్ హాజీ, అహ్మద్ అలీ, సయ్యద్ ముజ్తాబా హుస్సేన్, సీనియర్ జర్నలిస్ట్ షఫీక్ అహ్మద్ అథర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రితో ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబుకు ఘన స్వాగతం



శ్రీనుబాబును సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధానాకార్యదర్శిగా నియామకమై మొదటిసారిగా మంథని నియోజకవర్గానికి వెళ్తున్న దుద్దిళ్ల శ్రీనుబాబును కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజొద్దీన్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, కాంపెల్లి కీర్తికుమార్, పెద్దిగారి తిరుపతి, కొట్టె ప్రభాకర్, దన్నాసింగ్, సిరాజ్, కమ్రొద్దీన్, జూపాక సుదర్శన్, మీరజ్, ఇమామ్, ముల్కల కవిత, అస్తపురం తిరుమల, హసీనా, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వీణవంక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 120మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, వెంకట పాపయ్య, లచ్చయ్య, కరుణాకర్, శ్రీకాంత్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న మాలల ప్రదర్శన

సుభాష్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డు కృషి భవన్‌లో నిర్వహిస్తున్న రుద్రాక్ష, కరంగళి మాలల ప్రదర్శన సోమవారం ముగియనున్నట్లు రుద్రాక్ష పరిశోధకుడు దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు. రుద్రాక్ష, కరంగళి మాలలు ఎలా ధరించాలో పుట్టిన తేదీతో వస్తే సంపూర్ణ జాతకం చేసి ఉచితంగా వివరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

రామడుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు గంటె రాజేశం అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పరామర్శించారు. గంటె రాజేశంను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, మచ్చ రమేశ్, నాయకులు పవన్, తదితరులు ఉన్నారు.

చాడ శ్రీధర్‌రెడ్డి కుటుంబానికి..

చిగురుమామిడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ చాడ శ్రీధర్‌రెడ్డి తల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు చాడ శోభ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబసభ్యులను ఆదివారం మండల రెడ్డి సంఘం నాయకులు పరామర్శించారు. రెడ్డి జేఏసీ మండల అధ్యక్షుడు కాటం సంపత్‌రెడ్డి, జిల్లా రెడ్డి ఐక్య వేదిక ఉపాధ్య

'నాన్నకు ప్రేమతో' కవితా సంకలనం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'నాన్నకు ప్రేమతో' కవితా సంకలనం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కీర్తి పురస్కార గ్రహీత, ధర్మకేతనం సాహిత్య కళాపీఠం అధ్యక్షుడు ఎన్వీ రఘువీర్ ప్రతాప్ మాట్లాడుతూ భగవంతుడి స్థానంలో తండ్రిని నిలుపుకోవాలని, అప్పుడే భగవంతుడు సంతోషిస్తాడని అన్నారు. రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి, వేములవాడ ఆర్య వైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడారు. కీర్తి పురస్కార గ్రహీత, కథా రచయిత కూర చిదంబరం పుస్తక పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మకంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోతిరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-2005 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

ఆంజనేయులుగౌడ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

రామడుగు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్‌ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పరామర్శించారు. ఆంజనేయులు తండ్రి పరశురాంగౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామడుగు మండలం చిప్పకుర్తికి వెళ్లి ఆయనను ఓదార్చారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

చొప్పదండి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా తొడుపునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వల్లాల జగన్, మామిడి రాజేష్ పవార్, మాడూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సిరిపురం రాజు, కోశాధికారిగా పిట్టల వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఎల్‌సీఐఎఫ్ కో-ఆర్డినేటర్‌గా మహేశుని మల్లేశం, మెంబర్‌షిప్ కో-ఆర్డినేటర్‌గా పెద్ది లక్ష్మీకాంతం, సర్వీస్ చైర్‌పర్సన్‌గా తొడుపనూరి లక్ష్మయ్య, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా కొల్లూరి ఆనందం, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా కొల్లూరి జితేందర్, జాయింట్ సెక్రెటరీగా తాటిపెల్లి శివకుమార్, ట్యామర్‌గా బొల్లం సాంబమూర్తి, టేల్ ట్విస్టర్‌గా తాటిపెల్లి అంజయ్య, పీఆర్‌వోగా దూస రాము, బ్లడ్ డొనేషన్ కో-ఆర్డినేటర్‌గా గొల్లపెల్లి నరేష్, ఐబాల్ కో-ఆర్డినేటర్‌గా ఇప్పనపెల్లి తుకారాంను ఎన్నుకున్నారు. అలాగే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా మోర భద్రేశం, వల్లాల కృష్ణహరి, తాటికొండ శ్రీనివాస్, నలుమాచు సుధాకర్, పాత శ్రీనివాస్, గుర్రం విలాస్ రెడ్డి, నలుమాచు కాశీనాథం, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కొల్లూరి ఆంజనేయులు వ్యవహరించనున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

● హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



ట్రోఫీ అందజేస్తున్న వొడితెల ప్రణవ్

వీణవంక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. ఆదివారం వీణవంక మండలం బేతిగల్‌లో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. కోరపల్లి, బేతిగల్ మధ్య జరిగిన ఫైనల్‌లో కోరపల్లి విజేతగా నిలిచింది. విజేతకు రూ.12,000 వేలు, రన్నరప్‌కు రూ.6,000 వేల నగదు బహుమతిని మాసాడి చొక్కారావు అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం బేతిగల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసి మంజూరు పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ సాహెబ్ హుస్సేన్, ఎండీ సాహెబ్‌హుస్సేన్, అనిల్, శ్రీపతిరెడ్డి, దీక్షిత్, కొండాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, రాకేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

మానకొండూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం బస్టాండ్ వద్ద మానకొండూర్-ఊటూర్ గ్రామాల ప్రధాన రహదారిపై తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. వారం రోజులవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, నీరు కలుషితమై రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

కరీంనగర్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భట్టి విక్రమార్కకు ప్రజల అవసరాలు, రాష్ట్ర పరిస్థితిపై పూర్తి అవగాహన ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజొద్దీన్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్ నాయక్, దండి రవీందర్, దన్నాసింగ్, కాంపెల్లి కీర్తికుమార్, జూపాక సుదర్శన్, ముల్కల కవిత, అస్తపురం తిరుమల, కిషన్, బషీర్ పాల్గొన్నారు.



వేడుకల్లో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట : మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనుమల్ల సంపత్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది కుమార్, ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, నాయకులు సారంగపాణి, రామకృష్ణ, మహేష్, రవి, సాయికుమార్, రమేష్‌రెడ్డి, చిరంజీవి, రవీందర్, సాయిరాం, రాజబాబు, వంశీ, వేణు, పృథ్వీరాజ్, కుమార్ పాల్గొన్నారు.

జమ్మికుంట : పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ సజ్జు, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, నాయకులు గుండారపు సాయి, రాచపల్లి సాగర్, గోపి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టూ, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి 10:30 వరకు ఇంగ్లీష్ యూనియన్, మోర్ సూపర్ మార్కెట్, రాధా నిలయం, కవితా వెడ్డింగ్ మాల్ వెనక ప్రాంతం, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు శ్రీనగర్ కాలనీ, భవనీకాలనీ, గోదాంగడ్డ వెనకప్రాంతం, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, భగత్‌నగర్, సంతోషిమాత దేవాలయం, జడ్పీ క్వార్టర్స్ మోనాదయ్య హోటల్, ఉదయం 9గంటల నుంచి 11 వరకు నగునూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివిరంచారు.

మంత్రి పొన్నంను కలిసిన మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదివారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కలెక్టర్‌గా పని చేసిన ప్రఫుల్ దేశాయ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసి పూలమొక్కను అందజేశారు.



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రఫుల్ దేశాయ్

డాక్టర్ భూంరెడ్డి మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

చిగురుమామిడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని వర్గల ప్రజలకు సేవలందించిన డాక్టర్ భూంరెడ్డి మృతి తీరని లోటని మండల రెడ్డి సంఘం ఐక్య వేదిక అధ్యక్షుడు కాటం సంపత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో డాక్టర్ భూంరెడ్డి సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాంతల మహిపాల్‌రెడ్డి, వంటకాల సంపత్‌రెడ్డి, నంది రాజు, పూల లచ్చిరెడ్డి, జంగరాజు, ఇంద్రసేనా రెడ్డి, నాగెళ్లి రాజిరెడ్డి, నల్ల మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు

భగత్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాల్లో ఎంతో మంది పేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటికేదారి, కరీంనగర్‌నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, మామిడిపల్లి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నారు మడిలో ఎమ్మెల్యే పేరు



చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరుతో నారుమడి

చొప్పదండి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నాడు. చొప్పదండికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త రాజన్నల తిరుపతి తన పొలంలో వరినారుతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరును అక్షరాలతో తీర్చిదిద్దాడు.

పేదలకు వస్తువులు, ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వాసవి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం రాత్రి దాతల చేతుల మీదుగా పలువురికి వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. ప్రతి నెలా లక్ష రూపాయలను అవసరార్థులకు అందజేయాలని నిర్ణయించినట్లు, మొత్తం 90 వేల రూపాయల విలువైన నగదు, వస్తువులను అందించినట్లు ట్రస్టు చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు ఫణిశర్మ, పెద్ది విద్యాసాగర్, యాంసాని రాధాకృష్ణ, జీడిగె సాయికృష్ణ, విశ్వనాథుల రమేశ్, పెద్ది వేణు, చాడ సందీప్, రామిడి శ్రీధర్, గజవాడ శ్రీనివాస్, పుల్లూరి శ్రీనివాస్, చిన్న నాగరాజు, బండ లక్ష్మీనారాయణ, కొమురవెల్లి ఆనందం, మాడూరి లచ్చన్న, నార్ల శ్రీనివాస్, పల్లెర్ల వేణుమాధవ్ పాల్గొన్నారు.

పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్

కళ్యాణ్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయంగా మార్చిందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 59వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించిందన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి, రూ.500లకే వంట గ్యాస్, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు వేగవంతంగా జరుగుతుందని, రైతులకు ఏక కాలంలో రుణమాఫీతోపాటు రైతుభరోసా కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి తనపై నమ్మకంతో మంత్రి పదవి ఇచ్చారని, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని వామపక్ష పార్టీల నాయకులు ఐ కృష్ణ, శనిగరపు చంద్రశేఖర్, జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో 2024 నుంచి మావోయిస్టులను అణిచివేత పేరిట కేంద్ర ప్రభు త్వం ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేస్తుందని ఆరోపించారు. 17నెలల కాలంలో దాదాపుగా 540మందిని ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేశారని, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఖనిజ వనరులను అదాని, అంబానీలకు దోచిపెట్టేందుకు ఈ హత్యాకాండను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శితో సహా 28మందిని గత నెల 21న చంపారని, 1.23లక్షల చెట్లను నరికివేశారని, ఆదివాసీలను అడవుల్లో నుంచి తరిమికొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు.